కథా కౌముది

# తిరంగా ప్యార్

రేష్మ మహమ్మద్

ఫ్రీమాంట్ , కాలిఫోర్నియా

శ్రీ వికారి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
24వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం

**నేను** అతడిని కలవడానికి వెళ్ళినప్పుడు నీలిరంగు ఆకాశం జేగురు రంగులోకి మారుతుంటుంది. ఎప్పుడూ గమనించనేలేదు నేను. కానీ ఎందుకో గమనానికి వచ్చింది. అతను వ్యక్తపరచలేని ఆర్తి ఏదో అలా ఆకాశంలో పరుచుకున్నట్టు తోస్తుంటుంది నాకు. ఈ రంగుతో పరిచయం కొత్తేమికాదు. ఆ రంగు వెనుక దాగి ఉన్న రక్త పిపాస కొత్తది కాదు. కానీ ఈ రూపంలో దగ్గరవ్వాలని చూడడమే కొత్తగా ఉంది, మాయగాను ఉంది, మార్మికంగానూ ఉంది. నీలి ఆకాశాన్ని క్రమంగా ఆక్రమిస్తూ మింగేస్తూ పూర్తిగా జేగురు రంగులోకి ఆకాశాన్ని మార్చేయాలని అది పడే తపన చూస్తుంటే భయమేసేది. కానీ ఎన్ని రంగులు చుట్టూ పరుచుకుని ఉన్నా ప్రేమకి ఏదీ అంటదని తెలిసినా ఏదో సందేహం. ప్రేమ దేన్నీ లెక్క చేయదని మతం దానికి అడ్డుకాదని తెలుసు. కానీ, కాలాన దేన్ని నమ్మాలో కూడదో కూడా అంతుపట్టదు. అతడిని కలిసినప్పుడల్లా చిన్నప్పుడు పారేసుకున్నదేదో దొరికినట్టు అనిపిస్తుంది. ఎంతగా ముఖం మనసు విప్పారుతాయంటే భూమి నెమలై ఆకాశమంతా పురివిప్పినట్టు. అసలు ఆ పరిచయమే పెడగా జరిగింది. ఏ ప్రాముఖ్యతాలేని ఇద్దరికీ నీల్ పరిచయం చేసాడు ఫలానా అని. అప్పుడు ఓహో అని ఒక దండంతో అయిపోయిందనుకుంది. కానీ ఇలా దండకారణ్యమై ఇంకేమీ కనపడకుండా చేస్తాడని ఊహలోకి కూడా రాని విషయం.

తాను ఏ బంధాలలో ఉన్నాడో తెలీదు, నేను చాలా బంధాలలో ఉన్నానని తనకు తెలుసు. తనకూ ఉంటాయి తెంపుకోలేని సంకెళ్ళు. కానీ ఈ అనివార్యమైన అనుబంధాన్ని ఎలా విడదీయాలో తెలియడం లేదు. ఇద్దరికీ. అలా అనుకున్నప్పుడల్లా గుండెనెవరో కళ్ళముందే ముక్కలు చేస్తున్న భావన. కళ్ళెంబడి జలపాతాలు. కరిగి నీరైపోతున్న కాలం. ఎందుకు కలుగుతుంది ఇంత ప్రేమ. పట్టలేనంత ఒక జీవితకాలానికి కూడా పట్టలేనంత ఎన్నెన్నో జన్మలు కావాలనిపించేంత ప్రేమ ఎందుకు కలుగుతుంది? ఏమో? తనకెందుకు కలిగింది? తను ఆల్రెడీ సహచరుడితోనే ఉంది కదా?

నేను నీల్‌తో బహుశా చాలా సంవత్సరాలుగా కలిసి ఉంటున్నాను. మునీర్‌ను నేను నీల్ అని పిలుచుకుంటాను. మేం ఇద్దరం పుస్తకాలతో మమేకమై పుస్తకాలను సృష్టిస్తూ మా కమ్యూనిటీ కోసం పోరాడుతున్న రెండు పుస్తకాలం. ఒక చిన్న అలమరలో ఇద్దరం పుస్తక పక్షులం. ప్రతీ సాయంత్రము చర్చా వేదికే. మిత్రులు ప్రవహించే ఇల్లు. సమావేశాలు సభలు కవిత్వమూ కథలు నవలలూ ఎన్నెన్ని? ఒకటా రెండా జీవితం మొత్తం ఒక సాహితీ ప్రక్రియ. అసలు సమయమే తెలియలేదు. ఎప్పుడు భద్ర జీవితాన్ని గురించి ఆలోచించింది లేదు. ఇద్దరమే బతకాల్సి వచ్చినప్పుడు భద్రత దేని గురించి? దొంగలు పడ్డా పుస్తకాలు తప్ప ఏముంటాయి కనుక? పుస్తకాలు ఇంటినిండా, పక్కనించి వంటయింటిదాకా అంతటా పరుచుకుని ఉంటాయి.

తాను మొత్తంగా సాహిత్యం మీదనే దృష్టి పెడతాడు. సాహిత్యంతో సమాజాన్ని మార్చుతానని తనకి అచంచలమైన విశ్వాసం. వర్గపరంగా తాను మైనారిటీ అందుకోసం పోరాటం. హక్కుల కోసం పోరాడతాడు. అవున్నిజమే ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ పోరాడాలి. తాను ఎన్నుకున్న మార్గం తప్పేం కాదు. అసలు అతని సాహితీ సృజనే కదా తననూ ఆకర్షించింది.

అలా సాహిత్యం ద్వారనే నీల్ పరిచయం. నా కవితలు చూసి తను నన్ను ఇష్టపడి రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంది. అప్పటినుంచీ ఒకే కవితలో రెండువాక్యాల్లా కలిసే ఉన్నాం. చిన్నచిన్న గొడవలొచ్చినా సర్దుకునేవి. అవసరాలు పెద్దగా లేవు కనుక డబ్బుల అవసరం అంతగా లేదు కనుక బహుశా మేము గొడవలు ఎక్కువగా పెట్టుకున్నట్టులేదు.

నేను ఓ ఛానెల్‌లో ప్రోగ్రాం ప్రొడ్యూసర్‌గా పనిచేస్తాను. వచ్చే జీతం ఇల్లు, పుస్తకాలకు సరిపోతుంది. ఎప్పుడూ రేటింగ్ గొడవే. అయినా ఏం చేస్తాం. యాజమాన్యాల మనోవాంఛలకనుగుణంగానే నడుస్తాయి ఛానెల్స్. పరిధులు దాటరాదు. అన్ని రంగాల్లో లాగానే ఇక్కడాను. ఇక్కడ ఇంకెక్కువ. మొగుడికి మొగుళ్ళు చాలామంది ఉంటారిక్కడ. పై మొగుడు చెప్పిన దాన్నే పాటించాలి పెళ్ళాలందరూ. అలా స్వంత మెదడు ఉద్యోగాల్లోఉపయోగించడం ఎప్పుడో తగ్గించేశాను. కాదు పూర్తిగా మానేశాను. వాళ్ళేదంటే అదే ప్రోగ్రాం.

ఒకసారి ఇంటికొచ్చేసరికి ఇంట్లో ఉన్నాడు. తను రిషి అని పరిచయం చేశాడు నీల్. నమస్కారంతో అయిపోయిందనిపించింది పట్టించుకోనేలేదు. కానీ తన కళ్ళలో బొమ్మ కదుతుందని నేను అస్సలు ఊహించలేదు. అప్పటినుంచి తనను అనుసరించింది రిషి నీడ. రిషికి పెళ్ళయింది. తరువాత కూడా పెద్దగా మాట్లాడింది లేదు. కానీ ఇప్పుడు గుర్తు తెచ్చుకుంటే తెలుస్తుంది అతని నీడ తనని వెన్నంటే ఉందనీ అప్పుడు ఇప్పుడూ..!

మొదటిసారి జీవితంలో అందం గురించి విన్నది రిషి మాటల్లోనే. నువ్వు చాలా బావుంటావు అని. అతనికి మాట్లాడటం రాదు. ఆకర్షణగా చెప్పడం విన్నది రిషి మాటల్లోనే. నువ్వు చాలా బావుంటావు అని. అతనికి మాట్లాడటం రాదు. ఆకర్షణగా చెప్పడం అస్సలు రాదు. అయినా నేను నా గురించి విన్న మొదటి మాటలు నాకు చాలా వినసొంపుగా అనిపించాయి. నేను లైట్ తీసుకుని మా కామన్ ఫ్రెండ్స్‌ని చాలామందిని గుర్తుకు తెచ్చాను చాలా అందమైన అమ్మాయిల లిస్ట్ అంతా ఉంచాను. కానీ అతనిలో ఏమార్పూ లేదు. వాళ్ళందరికంటే నువ్వే బావుంటావు అన్నాడు. అది నిజం కాదని నాకు తెలుసు, అదే అన్నాను. నవ్వాడు పైకి కనిపించే దానితోపాటు అంతర్లీనంగా ఉండే సౌందర్యం వేరు అది ఆత్మ సౌందర్యం. అది అందరిలో కనిపించదు. రేర్. నీలాగా అన్నాడేమో లేక నాకు అలా అనిపించిందా? లేదు ఆట పట్టించాడా? లేకపోతే నేను నా గురించి ఎప్పటికీ అలా అనుకోలేను. అదే ఏమార్పూ లేని గొంతు. అలా ఎలా ఉండగలుగుతారో కొంతమంది నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంటుంది. ఏ ఉద్వేగాలు లేకుండా యుగాలనుంచి అనాలనుకున్న మాటే కదా అన్నట్టు అలా ఎలా మాట్లాడగలరు? అది ఏదైనా

విద్యా? స్పెషల్ కోర్సులుంటాయా అలా మాట్లాడ్డానికి? ఏమో? కనుక్కోవాలి అప్పుడు నేను మొదటిసారి నా రూపాన్ని అద్దంలో చూసుకున్నాను. నాకేమి అర్థం కాలేదు.

నేనెప్పుడూ ఉన్నట్టుగానే ఉన్నాను. ఎక్కడా డిఫరెన్స్ ఏమీ కనిపించలేదు. మొటిమలు మిగిల్చిన గుర్తులు జాగ్రత్తగా గమనిస్తే వెండి మెరుపుల కిరీటం కూడా వరించి వలచి వచ్చి చేరింది శిరస్సు పైకి. నవ్వేసుకున్నాను తెల్లగా. నేనెప్పుడూ తెలుపునే ఇష్టపడేదాన్ని.

నే ధరించే కాటన్ పైజమా కుర్తాలు కూడా ఎక్కువగా తెలుపువే ఉంటాయి. బ్లాక్ చున్నీ వేసుకుంటాను. ఈ కాంబినేషనే ఇష్టం నాకు. అయినా నేను ఆ మాటలకు కూడా కరగలేదేమో? ఎందుకంటే చిన్నప్పటినుంచీ నాకు అందమంటే ఇదీ అని ఎవరూ చెప్పలేదు. అందంగా ఉన్నవాళ్ళతోటే దోస్తీ చేయమని కూడా ఎవరూ నాతో అనలేదు. కలర్స్ నాకు ఎప్పుడూ సమస్యే కాలేదు. నా దోస్తుల్లో రకరకాల వాళ్ళున్నారు. తెలుపు నలుపు చామన చాయా, మనుషుల్లో నాకు నలుపురంగు వాళ్ళంటే ఎక్కువిష్టం. ప్రపంచం తెలుపులో అందాన్ని కొలుస్తుంటుంది. దునియా కొలమానాలతో నేనెప్పుడూ ఏకీభవించలేదు. కాబట్టి అందం ప్రసక్తి నా దగ్గర లేనేలెదు. కానీ రిషికి ఎలా ప్రేమించాలో తెలుసు. నాకు ప్రేమను నేర్పడం తెలుసు. నేను తనని ప్రేమించేలా చేసుకోవడమూ తెలుసు. ఇదెలా సాధ్యమైందో అంత చిన్న జీవితంలో అని నాకు సందేహం. ఏదేమైనా నాలాంటి కరుడుగట్టిన రాతిని కరిగించడం మాటలు కాదని ఇన్ని సంవత్సరాల అతని ఓపికని చూస్తే తెలుస్తోంది.

రిషి విషయాన్ని నేను ఎందుకో సీరియస్‌గా తీసుకోలేదు. కానీ రిషి సీరియస్ అని తరువాత అర్థమైంది. తనేమన్నా ముందు జీవితాన్ని గెలుపు అనే చెప్పేదాన్ని కాజ్‌వల్‌గా. కానీ అతను చాలా మొండిగా ఆ విషయాన్ని తీసుకుని నిజంగానే జీవితాన్ని గెలిచాడు. అతను అనుకున్నవన్నీ సాధించాడు. అప్పుడు కూడా మేం సంతోషించాం. ఇంకా ఎంకరేజ్ చేసాం నేను నీల్. కానీ ఆ ప్రోత్సాహం రిషి సరిపోదంటున్నాడు. తనకు జీవితాంతం కావాలంటున్నాడు. అదెలా సాధ్యం? నేను ఒక జీవితకాలం ఉలిక్కిపడ్డాను. అతని వృత్తి ప్రవృత్తి ఏదైనా అవని కానీ అతని దేవుడు మతము అతని వెనుక వెన్నంటి వచ్చే ఆ జేగురు రంగు నన్ను చాలా భయపెట్టాయి. కానీ అతని వెన్నెల నవ్వును చూస్తే మొత్తంగా చిత్రంగా అన్ని మరచిపోతాను.

ఎంత బాగా రాస్తాడో ఫిక్షన్. సినిమా చూసినట్టు ఉంటుంది. అదే చెప్పాను. ఎంత సంతోషపడ్డాడంటే మాటల్లో వర్ణించడానికి లేదు. నా మాటలకు అంతవాల్యూ ఉంటుందని కూడా నాకు మొదటిసారి తెలిసింది. ఎన్నో మాటలను నేను ఎక్కడెక్కడో పారేసుకుని ఉన్నాను వరదలా. కానీ రెండు మూడు మాటలకే అతనింత ప్రభావీం ఎందుకవుతున్నాడు? అంతలా సంతోషపడడం ఏమిటో అర్థంకాలేదు ముందు.

మీరు పసిపాపలాంటి వాళ్ళు అతను చెప్తుంటే నాకు ఏమనాలో తెలీలేదు. ఏ కోణంలో అనడగాలనుకున్నాను కానీ సంభాషణ పొడిగించడం ఇష్టంలేక వదిలించేసుకున్నాను.

అలా రిషి నా సంభాషణ ముందుకు సాగకుండా నేను క్రోటన్స్‌ని ట్రిం చేసినట్టు చేస్తూనే ఉన్నాను, ప్రయత్నపూర్వకంగా, అయినా సరే అతను దట్టమైన అరణ్యాన్ని సృష్టించేశాడు. అది అతని సృజనాత్మకత. ఆ అరణ్యం ఎవరికీ కనపడదు, నాకు తప్ప. అసలక్కడ అరణ్యముందంటే ఎవరూ నమ్మరు, తప్పిపోయే నేను తప్ప. అతనికి మాత్రమే సాధ్యమైన పకడ్బందీ సృష్టి. అంత అరణ్యాన్ని ట్రిం చేయడానికి నా శక్తి సామర్థ్యాలు సరిపోలేదు.

అందులోంచి బయటకు రాలేక నీల్ ముఖం చూడలేక నేను పడుతున్న నరకం గురించి ఎంత చెప్పినా తక్కువే.

అతను సర్వస్వం నువ్వే అంటాడు. నేను తెల్లబోయి వింటుంటాను. అతనేమీ ప్రత్యక్షంగా చెప్పడు. అన్నీ బొమ్మ కట్టిస్తాడు. ఆకులతో మాట్లాడిస్తాడు. గాలిని కూడా నృత్యం చేయిస్తాడు నా ముందు అతనికి విశ్వమంతా నేనేనట. అదెలా సాధ్యం నాకు నీల్ కదా!

నేను రిషి ప్రేమను మొదటిసారి గమనించడం మొదలు పెట్టాను. అది ఆది అంతం లేనిదిగా తోచింది. నేను అంత ప్రేమకు సరిపోయినదాన్ని కాదేమో అని కూడా సందేహం కలిగింది. ఎందుకంటే అంత ప్రేమను మునుపెన్నడూ చూడలేదు. నీల్ దగ్గర కూడా. అంత ప్రేమ పొందాలంటే నేను కూడా అంత ప్రేమనివ్వాలి కదా?

నా దగ్గర అంత సమయం ఎక్కడుంది? మహా అయితే ఇంకా నాలుగైదేళ్ళు ఆరోగ్యంగా ఉంటానేమో? అది కూడా ఎలా చెప్పగలను? ఎప్పుడేమవుతుందో తెలీని మనుషులకు గ్యారెంటీ కార్డు ఎలా ఇస్తాం? అయినా నీల్ ఏమైపోతాడు? అసలు నేనేమైపోతాను? నేను కట్టుకున్న పుస్తక సామ్రాజ్యం? ఇక్కడ నేనే మహారాణిని కదా! రిషి మనసులో మహారాణిని కావొచ్చు కానీ జీవితంలో? రిషి పట్ల ప్రేమను రోజుకున్న క్షణాల్లాగే వేల సార్లు తుంచేస్తున్నాను. అయినా మళ్ళీ మళ్ళీ జనించేస్తుంటాడు.

క్షణంలో వెయ్యిపుటకలు పుడుతుంటాడు ఏదో విధంగా, అది అతనికి మాత్రమే వచ్చిన రాక్షస విద్య. ఆ మాయలో పడి నేను లేవలేకున్నాను. నీల్‌కి ఆకుపచ్చంటే ఇష్టం. అది కమ్యూనిటీని సూచించేది కాకపోవచ్చు అవనూ వచ్చు. కానీ ప్రకృతిలో లేని రంగు మనుషులెక్కడ సాధించుకున్నారు. అంతా ప్రకృతి మయమే. రిషి వెనుక రంగుందేమో కానీ మనసుకి కూడా రంగంటుకుని ఉంటుందా? మతం ప్రేమకు అడ్డుకట్టా? నేను తనను మా మతం తీసుకో అని అడగ్గలనా? నువ్వు మా ఆచారం ప్రకారం సున్తీ చేయించుకో అని రూల్స్ పెట్టాలా? ప్రేమను ఖచ్చితంగా మతం శాసిస్తోందా?

రిషి బహుశా రూలింగ్ పార్టీ మనిషేమో అని అనుమానం కలిగింది. పనిగట్టుకుని మా జీవితాల్ని డిస్ట్రబ్ చేస్తున్నాడేమో అనిపించింది నాకు. కానీ ప్రేమ రాజకీయాన్ని ఒకే త్రాసులో వేయలేకపోయాను. ఒక మతం కాకపోవచ్చు కానీ మనిషి జాతే కదా! ఎన్ని అడ్డంకులు వేసుకున్నా అన్ని హర్డిల్స్ అవలీలగా దాటేసుకుని వచ్చేస్తున్నాడు దూసుకుని. ఆపాలి, ఎలా ఆపాలో తెలీదు. మనసుని జారిపోనీకుండా పట్టుకోవాలి, ఎలా ఏం చేయాలి?

నీల్‌కి రిషి భావనలు తెలిసాయి. నీల్‌కి తెలిసినట్టు రిషికి తెలుసు. ఘర్షణ ప్రారంభం. నీల్‌కి నన్ను పోగొట్టుకుంటానన్న సందేహం రాలేదు కానీ నేను దారి తప్పి అగాధాల్లో పడతానేమోనన్న భయం నేను ఏమైపోతానన్న దిగులూ ఆవరించాయి. తనలో అవి స్పష్టంగా కనిపిస్తున్నాయి. అందుకే నీల్ జేగురు రంగు దాష్టీకాలను ఏకరువు పెట్టడం మొదలుపెట్టాడు. క్రూరత్వాన్ని అది ఆకుపచ్చపై చేసిన దాడుల్ని గాయాలను మళ్ళీ మళ్ళీ విప్పి చెప్తున్నాడు. అదీ డెమోక్రసిలో ఇలా జరుగుతుందని పదే పదే ఉదాహరణలు చూపిస్తున్నాడు. నిజానికి మేము ఇన్నాళ్ళూ పోరాడింది దానిపైనే కదా. ఆ రంగు ఎంత ప్రమాదకారో విధ్వంసాల దగ్గరినుంచి ఏకరువు పెడుతున్నాడు. అయినా నాకు తెలుసు ఆ రంగు గురించి. కానీ ప్రేమకు రంగుండదు కదా! అది నిర్మలం. ఆ రంగు వెనుక తీవ్రవాదం ఉందంటాడు, అది మైనారిటీలపై కేంద్రీకృతమైందంటాడు. ఇప్పటికే జరగాల్సిన అనర్థాలన్నీ జరిగాయి. ఇంకేం జరుగుతాయోనని ఒక అభద్రతా భావనను చుట్టూ పేర్చుతాడు. నిజమేననిపిస్తుంది. నాకు గతాన్నీ వర్తమానాన్నీ చూస్తుంటే. పాతబస్తీ గల్లీలు చూసినప్పుడు మాసికలేసిన బుర్ఖాలను చూస్తున్నప్పుడు, ఆవు మాంసం దుకాణాల దగ్గర జనాలు మూగినప్పుడు నిజమేననిపిస్తుంది. ఊపిరాడని బొమ్మరిల్లలో బొమ్మల్లా కాపురముంటున్న మనుషులనబడే జీవచ్ఛవాలను చూస్తున్నప్పుడు నిజమేననిపిస్తుంది. ఇంత వివక్షలేంటీ అనిపిస్తుంది.

రిషి అంతే. ఆకుపచ్చ రంగు గురించి చాలామాట్లాడతాడు. ఆ రంగు వెనుక క్రూరత్వం గురించి చెప్తాడు కథలు కథలుగా. ఎక్కడెక్కడ ఎంతమంది అమాయకులు బలయ్యింది రీళ్ళు రీళ్ళుగా దృశ్యీకరిస్తాడు. దేశభక్తి లేదంటాడు. తీవ్రవాదం అంటాడు. రకరకాలుగా మన్సు విరిచేయాలని చూస్తాడు.

ఈ రెండు రంగుల ఆధిపత్య అహంకారాల మధ్య నేను మూడో రంగునై నలిగిపోతున్నాను. నిజానికి వీళ్ళిద్దరూ చెప్తున్న ఈ రంగుల వెనుక ఉన్న విధ్వంసాలతో ఈ ఇద్దరికీ ఏ సంబంధము లేదు, అవి వేరేవాళ్ళకు సంబంధించినవి, కానీ వీళ్ళిద్దరిపై ఆరోపించుకుంటున్నారు. ఇలా ఆలోచించిన తరువాత ప్రశాంతంగా అనిపించింది.

ఇన్ని సంవత్సరాల బంధం నాది నీల్‌తో ఎలా తెంపేసుకుంటా చెప్పు అంటే అదే అంటున్నాను ఇన్ని ఏళ్ళు ఉన్నావు కదా నాతో ఈ కొన్ని రోజులు కలిసి ఉండు అంటూ మంకు పట్టు పట్టే చిన్నపిల్లాడు రిషి.

నువ్వు చెదలు కావు అస్తమానం పుస్తకాలతోనేనా జీవితం? నువ్వు దేవతవి కాదు కళ్ళు ఆర్చకుండా ఒకే కోణంలో బతకడానికి నువ్వు మనిషివి, జీవితంలో చాలా పార్శ్వాలున్నాయి అంటూ కొత్తలోకాల్ని పరిచయం చేసాడు రిషి. అందులోదే ప్రేమలోకం. నేను అతను చూపించిన కొత్తదనానికి మురిసిపోలేదు. నాకు ప్రేమంటే తెలిసింది కాబట్టి. జీవితంలో పోరాటంతో పాటు ప్రేమకూడా ఉంటుందని తెలుసుకున్నాను కాబట్టి రిషిపై ప్రేమ. అది కృతజ్ఞత కాదు, సహజ స్పందన.

నాకేం అర్థంకావడంలేదు. ఈ ఘర్షణకు అంతే లేదా? కాలం కుబుసం విడిచినతాచులా వేగంగా పయనిస్తోంది. పట్టుకోలేక పోతున్నా. నాలోనూ నిరంతర ఘర్షణ.

నాకు కల్లోలాలు అసలు ఇష్టం ఉండదు. నేను శాంతిని కోరుకునేదాన్ని. శాంతికి మారురూపంగా ఉండాలనుకునేదాన్ని. నేనే ఇంత సంఘర్షణకు లోనవ్వడమేంటి? అసలు మేం శాంతిగా ఏ ఘర్షణలు లేకుండా సంతోషంగా కలిసి పయనించాల్సిన మనుషులం కదా! ఈ మూడింటిలో ఏ రంగు మరో రంగుపై ఆధిపత్యం చెలాయించినా అది అసమానత్వం అవుతుంది. మూడు రంగులు నలుగురు మనుషులు కలిసి జీవించడం తప్ప. ఒకే భూమిపై కలిసే ఉన్నాం కదా అనుకోవడం తప్ప ఇంకేం పరిష్కారం ఉండదేమో?

నేను తనదానిగా అనుకుంటాడు నీల్. ఎప్పటినుంచో నీది కదా ఇప్పుడు నాది ఎందుకు కాకూడదు అనుకుంటాడు రిషి. నేనేం అనుకోవాలి? అసలు నాకు ముందే నా అస్తిత్వంతో పెద్ద తకరారు. మనుషులు ఏ రంగులో ఉన్నా తెల్లటి మనసుతో ఉండాలనుకుంటాను ఎవరికీ లొంగని మనస్తత్వం. ఇప్పుడు రిషికి చేయందిస్తే నన్ను కాషాయం ముంచేస్తుందా? నా తెలుపును పూర్తిగా ఆక్రమించేస్తుందా? నాకు అస్తిత్వం లేకుండా పోతుందా? ప్రేమతో చెపితే నేను రిషి అభ్యర్ధనను కాదనలేక రేపటినుంచి బొట్టు కూడా పెట్టుకుంటానా? చేతులు రెండూ దగ్గరికి చేర్చి విగ్రహారాధన మొదలుపెడతానా? ఏమై మిగులుతాను?

ఒక్కసారి నీతో గడిపిన కాలాన్ని వెనక్కు తిప్పి చూసుకున్నాను. మొత్తం పుస్తకాలు, సభలు, సమావేశాలతో నిండిపోయి ఉంది. వీటన్నిటిలోనూ జీవితమే పరుచుకుని ఉంది. అక్కడ నవ్వులు, పాటలు, సరదాలు పిల్లలు, మొక్కలు పూలు తోటలు ఆస్తులు ఉద్యోగాలు బ్యాంక్ బాలెన్స్ ప్రేమ ఏవీలేవు. ప్రత్యేకంగా ప్రేమించే క్షణాలంటూ ఏవీ లేవు. అంతా సాహిత్యమే? ఒక సినిమా చూసి ఎన్ని రోజులయింది? ఒక

పార్క్‌కి వెళ్ళి ఎన్ని దినాలయింది? అసలు సాహిత్యం తప్ప ప్రపంచంతో అనుసంధానం ఇంకేమన్నా ఉందా? ఎవరింటికీ పోవడాలూ రావడాలూ ఉన్నాయా? నవ్వులు కేరింతలు అడ్రస్ ఎక్కడా? కానీ జీవితమంటే ఇవికూడా కాదా?

ఉన్నది ఒకటే లైఫ్ అయినప్పుడు వీటికి మాత్రం ఎందుకు దూరం కావడం? నా ఈ సందిగ్ధాన్ని ఎవరు నివృత్తి చేయగలరు. ఒక్కళ్ళు చేస్తే పోయే ఊగిసలాటా ఇది. నాలుగు జీవితాలాట. జీవితాన్ని కాచి వడపోసిన ఎంతమంది ముందో ఉంచాల్సిన ప్రహేళిక.

ఫోన్ మోగింది. మేడం ఈ పదిహేను రోజుల్లో కొత్త ప్రోగ్రాం చేయాలట. లేకపోతే ఉద్యోగాలు ఊడిపోవచ్చట అంటూ తాజా కబురు అందించాడు సబ్‌ఎడిటర్.

జీవితాల గురించి తల్లడమల్లడమవుతుంటే ఉద్యోగాలొకటి ఊపిరాడనివ్వవు. అట్లాగే కళ్ళు మూసుకుని పడుకుండిపోయింది. తెల్లారి లేచి ఆఫీస్‌లో ఇన్‌ఛార్జ్‌తో గొడవేసుకుంది. ఇంకెప్పుడూ మా ఇష్టమైనట్లు ప్రోగ్రాములు రూపొందించేది అంటూ. ఒక్కసారి మాకు అవకాశం ఇవ్వండి అప్పుడు సరిగా చేయకపోతే ఉద్యోగాలకు రిజైన్ చేసి పోతాం అని ఆర్గ్యూ చేసింది. ఇన్‌ఛార్జ్ చాలాసేపు తర్జన భర్జన పడి ఒక్కసారికి అవకాశం ఇచ్చాడు. మీ ఇష్టం అని. ఇద్దరు మేల్ యాంకర్లను ఒక లేడీ యాంకర్‌తో తన జీవితాన్ని రంగరించి రాసిన డైలాగ్స్‌తో ఒకవారం రోజులపాటు ట్రైనింగిచ్చింది. వాళ్ళు అచ్చం తన జీవితానికి ప్రతిబింబాల్లా ఉన్నారు. కొంత నల్లమల అడవిలో షూటింగ్ చేయించింది. ఇంకా కొంత కొంచెం ఆర్టిస్టిగ్‌గా ఉన్న ఫ్రెండ్ ఇంట్లో షూట్ చేయించింది. కొన్ని రొమాంటిక్ సీన్స్ మిస్ చేసింది. మధ్యలో లవ్ సాంగ్స్ హృదయాలు ద్రవించే డైలాగ్స్‌తో మొత్తానికి అనుకున్న టైంకి అనుకున్నదానికంటే బాగా వచ్చింది ప్రోగ్రాం. అద్భుతంగా ఉంది మేడం పిచ్చ రేటింగ్ వస్తుంది ఛానెల్‌కి అంటూ షేక్‌హాండ్ ఇచ్చాడు సబ్‌ఎడిటర్. మొత్తం తన నీల్ రిషి కథే. కొత్త జీవితాన్ని చూస్తున్నట్లుంది. యాంకర్స్ చాలా హ్యాపీగా ఫీల్ అవుతున్నారు తమకు మంచిపేరు వస్తుందని అయితే తెలుపు ఎవరో ఒకరితో కలిసి ఉండాలా లేక ఇండివిడ్యువల్‌గానా లేక నలుగురూ కలిసి ఉండాలా? లేక రిషి తాను తమ సహచరుల్ని వదిలేయాలా? విషయాన్నీ ఆడియెన్స్‌కి వదిలేసింది. ముగింపు మొత్తం ఆడియెన్స్ చేతిలో ఉంది ఆడియెన్స్ పోల్ ఏర్పాటైంది. మన ఉద్యోగాలు గ్యారెంటీ మేడం అంటున్నాడు సబ్‌ఎడిటర్. నిర్వేదంగా ఉండిపోయింది. తాను రేటింగ్ కోసం చేసిందా ప్రోగ్రాం? ఉద్యోగం కోసమా? ఒక తీర్పు కోసం. కానీ నిజంగా దానికి ఫాలో అవుతుందా?

ఫలితం ఏదైనా భయపెట్టి తీరుతుందని ఎదుర్కొనే ధైర్యం లేని తను ఇంకా రెండురోజులు ఉంది ప్రోగ్రాం ప్రసారం కావడానికి అనగా లీవ్ పెట్టి అజ్ఞాతవాసానికి వెళ్ళిపోయింది. మీకెప్పుడైనా నేనెదురైతే మాత్రం మీ అభిప్రాయాన్ని మీలో ఉంచండి. నాతో ప్రస్తావించకండి. నాకింకా జీవితాన్నెదుర్కొనే సాహసం రాలేదు. ఇంకా నేను ప్రోగ్రాం ప్రొడ్యూసర్‌నే. నా జీవితం ఛానెల్‌కి నేనింకా అధిపతిని కాలేదు. నా జీవిత ప్రసారాల హక్కు నా చేతిలో లేదని మొదటిసారి నాకు తెలిసిన క్షణాలు. ఒక జీవితకాల యుద్ధం మొదలైంది.

COMMENTS